క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్‌: నగరంలోని కొంగారెడ్డి పల్లె సెక్షన్‌లో సోమవారం లైన్ల నిర్వహణ కారణంగా విద్యుత్‌ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదన్నారు. కొంగారెడ్డిపల్లె, పుత్తూరు రోడ్డు, మురగానిపల్లె, సీకేపల్లె, బీవీరెడ్డి కాలనీ, లక్ష్మీనగర్‌ కాలనీ, కట్టమంచి చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా ఆయన కోరారు.

నేడు కార్పొరేషన్‌లో గ్రీవెన్స్‌ డే

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్‌ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని, ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): చిత్తూరు అపోలో కాలేజీలో పనిచేస్తున్న మహేందర్‌నాథ్‌, ధనంజయ రచించిన 'బేసిక్స్‌ ఆఫ్‌ కార్పొరేట్‌ సోషియల్‌ రెస్పాన్సిబిలిటీ అండ్‌ కార్పొరేట్‌ గవర్నెన్స్‌' అనే పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఆవిష్కరించారు. నెల్లూరు జిల్లా స్వర్ణభారత్‌ ట్రస్టు భవన్‌లో ఆదివారం ఆయన్ను వారు మర్యాదపూర్వకంగా కలిసి పుస్తకావిష్కరణ చేశారు. వెంకయ్యనాయుడు నుంచి వారు అభినందనలు అందుకున్నారు.

కుష్ఠువ్యాధి లక్షణాలపై అవగాహన



కుష్ఠువ్యాధి లక్షణాలను పరిశీలిస్తున్న లెప్రసీ అధికారి జాన్‌

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు కుష్ఠువ్యాధి (లెప్రసీ) అక్షణాలపై అవగాహన ఉంటే వ్యాధిని అరికట్టుకోవచ్చని లెప్రసీ డిప్యూటీ పారామెడికల్‌ ఆఫీసర్‌ జాన్‌ తెలిపారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, జాన్‌ ఆరోగ్య సిబ్బందితో కలసి సింహరాజుపురం, పాలసముద్రం దళితవాడలో కుష్ఠువ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. లెప్రసీ డిప్యూటీ పారామెడికల్‌ అధికారి జాన్‌ మాట్లాడుతూ చర్మంపై మచ్చలు ఉంటే వాటిపై స్పర్శ ఉందా లేదా పరీక్షించాలని తెలిపారు. కనురెప్పలపై ఉన్న వెంట్రుకలు రాలిపోతాయని, రాగి రంగు మచ్చలు ఉంటే కుష్ఠువ్యాధిగా గుర్తించాలని తెలిపారు. ఇటువంటి కనబడితే వెంటే ఎంబీటీ మందులు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కొంతమందికి ఉన్న మచ్చలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట సూపర్‌వైజర్‌ మురళి, సుశీల, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్‌ వితరణ

పలమనేరు: పట్టణంలోని కాకాతోపు ప్రభుత్వ ఉర్దూ పాఠశాలకు పట్టణానికి చెందిన దాత జావీద్‌ రూ.15వేల విలువచేసే ఉడ్‌ టేబుల్‌ను ఆదివారం వితరణగా అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మునాఫ్‌ ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దాతను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల కోసం దాతలు ముందుకురావాలని ఆయన కోరారు.

నేడు కోనేటిరాయుని కల్యాణం

గంగవరం: టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో నేడు పౌర్ణమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ గజేంద్ర ఆదివారం తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి రోజున స్వామివారి కల్యాణోత్సవం ఆగమోక్తంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. నేటి కల్యాణంలో పాల్గొనే భక్తులు ఇద్దరికి రూ.300 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనాలని తెలిపారు.

కోలాహలం.. స్వామివారి ఊరేగింపు

నదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ బత్తలవారిపల్లెలో కొత్తగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. దీక్షా హోమం, హోమం, పంచామృతాభిషేకం, అన్నదానం, మహామంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి. రాత్రి పాట కచేరి నిర్వహించారు.

రాఖీతో రక్ష!



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు, (ఇన్‌సెట్‌) ఆకర్షణీయమైన డిజైన్లలో వివిధ రాఖీలు

- అన్నా చెల్లెల అనుబంధానికి రక్షాబంధన్‌
- మార్కెట్లో కనువిందు చేస్తున్న రాఖీలు
- నేడు రాఖీ పౌర్ణమి

కాణిపాకం: సోదర బంధానికి ప్రతీక రాఖీ.. రక్షాబంధన్‌ సోదర సోదరీ ప్రేమానురాగాలకు ప్రతీక. ఇంటిల్లిపాది చేసుకునే ఆత్మీయ వేడుక. మానవ సంబంధాల విలువలను పెంచే దీపిక. రక్తసంబంధీకులు లేకున్నా మనకోసం అండగా నిలిచే ఆప్తులనే సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీలు కట్టి సోదరభావాన్ని పెపొందించుకునేందుకు రాఖీ పౌర్ణమే మంచి సందర్భం. మానవీయ సంబంధాలను పటిష్టం చేస్తూ సోదరప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్‌ సంప్రదాయబద్ధమైన మన విలువలను ఉట్టిపట్టేలా చేస్తుంది. ఉన్మాద తత్వం, విచక్షణ వంటి వెకిలిచేష్టలు పెరిగిపోతూ మానవతావిలువలు మంటగలుస్తున్నా ప్రస్తుత ఆధునికయుగంలోనూ రాఖీ పౌర్ణమి తన విశిష్టతను చాటిచెబుతూ సోదరప్రేమ పటిష్టతకు దోహదపడుతుంది. పవిత్ర శ్రావణమాస పౌర్ణమి వేళ వచ్చే ఈ పండుగకు ప్రజలు సిద్ధమవుతున్నారు. సోమవారం రాఖీ కట్టేందుకు ఆడపడుచులు పుట్టిళ్లకు చేరుకుంటున్నారు.

సంప్రదాయ వేడుక

రక్షాబంధన్‌ పర్వదినాన్ని పురస్కరించుకొని అక్కా చెల్లెల్లు రాఖీని దేవునిముందు ఉంచి పూజలు నిర్వహిస్తారు. తనకు అన్ని విధాలుగా రక్షణగా నిలవాలని కోరుకుంటూ రాఖీని సోదరునికి కట్టి నుదుట సింధూరం దిద్దుతారు. ఇదంతా సంస్కృతి, సంప్రదాయాల గొప్ప తనంగా చెబుతారు.

సమకాలీనతకు చోటు

మారుతున్న పాశ్చాత్య ధోరణులకు అనుగుణంగానే రాఖీ పండుగలోను మార్పులు సంతరించుకుంటున్నాయి. గతేడాది ఇదే తరహాలో పలువురు అక్కా చెల్లెల్లు తమ సోదరునికి హెల్మెట్‌ అందించడం, కరోనా సమయంలో శానిటైజర్లు, మాస్కులు, విభిన్నమైన రీతిలో కానుకలు ఇస్తూ వార్తల్లో నిలిచారు. ఇంకా దూరప్రాంతాల్లో ఉంటున్న వారు ముందుగానే రాఖీని పోస్టుల్లో పంపుతున్నారు. సోదరుల సంక్షేమం, క్షేమం కోరుతూ సందేశాలనూ పంపుతున్నారు. ఇప్పుడు సోషల్‌ మీడియాను వేదికగా రాఖీ బంధాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి.

వందల డిజైన్లలో రాఖీలు



చిత్తూరు నగరంలో రాఖీలు కొన్ని వందల మోడల్స్‌ కనిపిస్తే వాటిలో 90 శాతం చిన్నారులను దృష్టిలో పెట్టుకుని రూపొందించినవే. దీంతో సంప్రదాయ రాఖీల్లోనూ మార్పులు వచ్చాయి. ప్రస్తుతం మార్కెట్లో జ్యూవలరీ, జూరీబుట్టి, కుందన్‌ రాఖీలతో పాటు స్టోన్‌ రాఖీలు మార్కెట్లో కనువిందుచేస్తున్నాయి. రూ.10 నుంచి రూ.500 వరకు ధర పలుకుతున్నాయి. వారం రోజుల ముందు నుంచే రాఖీ కొనుగోలు మొదలయ్యాయని గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది కొంత మేర అధికంగా వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. కాగా రాఖీని పురస్కరించుకుని రాఖీ విక్రయషాపులు సందడిగా కనిపించాయి. మహిళలు, యువతులతో రాఖీ షాపులు కిటకిటలాడాయి.

బీఎస్‌ఎన్‌ఎల్‌తో మరిన్ని సేవలు

- పలు సేవలు అందుబాటులో
- మై బీఎస్‌ఎన్‌ఎల్‌ పేరిట గూగుల్‌ ప్లేస్టోర్‌లో ఇన్‌స్టాల్‌

చిత్తూరు కార్పొరేషన్‌: బీఎస్‌ఎన్‌ఎల్‌ యాప్‌ సేవలతో వినియోగదారులకు మరింత చేరువ అవుతోంది. బిల్‌ పేమెంట్‌, రీచార్జ్‌, ఫ్యాన్సీ నంబర్ల ఎంపిక, ఫిర్యాదులు, డేటా యూసేజ్‌ వంటి మరిన్ని సేవలు అందిస్తున్నాయి. కాలానుగుణంగా మార్పును గ్రహించిన ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్‌ సంచార్‌ నిగమ్‌ లిమిటెడ్‌ (బీఎస్‌ఎన్‌ఎల్‌) టెక్నాలజీతో వినియోగదారులకు చేరువవుతోంది.

యాప్‌ ద్వారా సేవలు

- గూగుల్‌ ప్లే స్టోర్‌లో మై బీఎస్‌ఎన్‌ఎల్‌ యాప్‌ను ఇన్‌స్టాల్‌ చేసుకోవాలి. ఆ తర్వాత ఈ–మెయిల్‌ ఐడీ లేదా రిజిస్టర్‌ మొబలై నంబర్‌తో యూజర్‌ నేమ్‌ పాస్‌వర్డ్‌ను క్రియేట్‌ చేసుకోవాలి. అనంతరం మన మొబైల్‌ నంబర్‌కు వచ్చే ఓటీపీ ఎంటర్‌ చేస్తే రిజిస్ట్రేషన్‌ పూర్తవుతుంది.
- ఒకప్పుడు బీఎస్‌ఎన్‌ఎల్‌ బిల్లులు చెల్లించాలంటే క్యూలో గంటలు తరబడి నిలబడాల్సిన పరిస్థితి. ఇప్పుడు బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన ల్యాండ్‌ ఫోన్‌, మొబైల్‌ పోస్ట్‌పెయిడ్‌, ఇంటర్నెట్‌ బిల్లులను యాప్‌ ద్వారా నిమిషాల్లో చెల్లించవచ్చు. ప్రీపెయిడ్‌ మొబైల్‌కు యాప్‌ ద్వారా రీచార్జ్‌ చేసుకోవచ్చు.
- దేశం మొత్తం మీద అందుబాటులో ఉన్న ఫ్యాన్సీ నంబర్లు, వాటి ధరలను తెలుసుకోవచ్చు. తద్వారా మనకు కావాల్సిన నంబర్‌ను మనం సొంతం చేసుకోవచ్చు. బీఎస్‌ఎన్‌ఎల్‌ ఫ్యాన్సీ నంబర్‌ను ఎంపిక చేసుకుని మన మొబైల్‌ నంబర్‌ ఇస్తే ఎస్‌ఎంఎస్‌ ద్వారా పిన్‌ నంబర్‌ వస్తుంది. ఆ నంబర్‌ మనకు 40 గంటల పాటు రిజర్వు చేసి ఉంచుతారు. ఆలోపు బీఎస్‌ఎన్‌ఎల్‌ కార్యాలయానికి వెళ్లి నంబర్‌ను సొంతం చేసుకోవచ్చు.
- యాప్‌లో మన ల్యాండ్‌లైన్‌, బ్రాండ్‌ బ్యాండ్‌, మొబైల్‌ సీడీఎంకు చెందిన ప్రతిరోజు వినియోగాన్ని పొందవచ్చు.



మై బీఎస్‌ఎన్‌ఎల్‌ యాప్‌

- ల్యాండ్‌ఫోన్‌, మొబైల్‌ ప్రీపెయిడ్‌, పోస్ట్‌పెయిడ్‌ బ్రాండ్‌కు సంబంధించిన హిస్టరీని యాప్‌లోని హిస్టరీ ఆప్షన్‌ ద్వారా తెలుసుకోవచ్చు.
- బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన ప్రత్యేక ఆఫర్ల వివరాలను యాప్‌తో పొందవచ్చు.
- సేవలకు సంబంధించిన ఫిర్యాదులను వినియోగదారులు యాప్‌లోని కంప్లైంట్‌ అనే ఆప్షన్‌ ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చు. తద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు.
- కొత్త ల్యాండ్‌లైన్‌, ఇంటర్‌నెట్‌ కనెక్షన్‌ యాప్‌ ద్వారా బుక్‌ చేసుకోవవచ్చు.

సేవలు విస్తరిస్తున్నాం..



బీఎస్‌ఎన్‌ఎల్‌ సేవలను అప్‌డేట్‌ చేస్తున్నాం. ప్రైవేటు సంస్థలకు దీటుగా సేవలు అందుబాటులోకి తెస్తున్నాం. యాప్‌ ద్వారా పలు సేవలను వినియోగదారులు పొందవచ్చు. వీటిని సంబంధిత సెక్షన్ల వారీగా సమస్యలను పరిష్కారిస్తున్నాం.
–సురేంద్ర, డీఈ బీఎస్‌ఎన్‌ఎల్‌

ఘనంగా శ్రీశక్తి నాగాలమ్మ ద్వితీయ వార్షికోత్సవం

చిత్తూరు రూరల్‌(కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టు బైపాస్‌ రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో వెలసిన శ్రీశక్తి నాగాలమ్మ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపతి హోమం, 108 శంఖాలతో జలాభిషేకం, కలశ పూజ, వివిధ పుష్పాలతో అలంకరణ, అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు



అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 19వ తేదీన సోమవారం శ్రావణ పౌర్ణమి(రాఖీ పౌర్ణమి) సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతరావు తెలిపారు. ఆలయంలో అర్చకులు ఉదయం 9 గంటలకు స్వామివారికి అభిషేకం, సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తారని పేర్కొన్నారు. 11 గంటలకు ఆలయ మండపంలో స్వామికి సుదర్శన హోమం నిర్వహిస్తామని వివరించారు. వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. సాయంత్రం 8 గంటలకు స్వామివారికి ప్రాకారోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయంలో భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, భజనలు నిర్వహిస్తామని ఈఓ హనుమంతరావు పేర్కొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని పౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీకామాక్షీ సమేత స్వయంభు మొగిలీశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం రాహు కాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహుకేతు, సర్ప దోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఆలయంలో రాహుకేతు పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, దోష నివారణ చేసుకోవాలని కోరారు.

వైభవంగా తెప్పోత్సవాలు



తెప్పపై విహరిస్తున్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారు



గ్రామ వీధుల్లో శ్రీవేణుగోపాలుడి ఊరేగింపు



స్వామివారి ఊరేగింపులో కోలాటాలు

కార్వేటినగరం: తెప్పోత్సవ వేడుకలను పురస్కరించుకుని రెండో రోజు ఆదివారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారు పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన తదితర నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను పట్టు వస్త్ర సుగంధభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి పుర వీధుల్లో మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 7 గంటల నుంచి స్కంధ పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై స్వామివార్లను ప్రతిష్టించి 5 చుట్లు తిప్పారు. దీంతో తెప్పోత్సవాన్ని తిలకించడానికి హాజరైన అశేష జనవాహినికి తెప్పపై ఆశీనులైన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారు అభయమిచ్చారు. భక్తులు గోవింద నామాన్ని స్మరించుకుంటూ స్వామివారికి స్కంధ పుష్కరిణిలో కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్‌, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల నూతన కార్యవర్గం

పుత్తూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డప్పు కళాకారుల సమస్యల పరిష్కారం కోసం సంఘం అహర్నిశలు కృషి చేస్తోందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఓ ప్రైవేట్‌ పాఠశాలలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా దళిత డప్పు కళాకారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎర్రవారిపాళెంకు చెందిన డి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన కె.మురగారెడ్డిని, ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మురగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం డప్పు కళాకారులకు 45 ఏళ్లకే పింఛన్‌ అందజేయాలని, అలాగే దుస్తులు, వాయిద్య పరికరాలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'పురాణం' మృతి తీరని లోటు





సంతాపం తెలుపుతున్న రచయితలు, ఇన్‌సెట్లో పురాణం

పలమనేరు: ప్రముఖ సాహితీవేత్త, సీనియర్‌ జర్నలిస్ట్‌ పురాణం త్యాగమూర్తి శర్మ మృతి సాహితీ లోకానికి తీరని లోటని పలమనేరు రజయితల సంఘ గౌరవాధ్యక్షుడు మాధవ్‌ తెలిపారు. పురాణం త్యాగమూర్తి శర్మ అనారోగ్యంతో చికిత్సపొందుతూ బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో శనివారం మృతిచెందారు. ఈ సందర్భంగా స్థానిక రచయితలు పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఆయనకు నివాళుర్పించారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లి రచయితల సంఘ గౌరవాధ్యక్షుడిగా విధుల నిర్వహిస్తూ సాహితీలోకానికి ఆయన విశేష సేవలను చేశారన్నారు. ఆయన తెలుగు, ఆంగ్ల భాషల్లో రాసిన ఎన్నో పుస్తకాలు సమాజానికి మార్గనిర్దేశంగా మారాయన్నారు. కవులు కుమారస్వామిరెడ్డి, తులసీనాథం నాయుడు, యుగంధర్‌, గిరిధర్‌మూర్తి, సిద్ధార్థ, గండికోట వారిజ, లైబ్రేరియన్‌ హేమంత్‌ కుమార్‌ పాల్గొన్నారు.

మట్టి గణపయ్యలే మేలు!

- పీఓపీతో పర్యావరణానికి ముప్పు
- చవితి వేడుకలకు మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ
- ఆరోగ్యకరమైన పర్యావరణానికి సామాజిక బాధ్యత
- చైతన్యం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు



ప్రకృతికి మేలు చేసే మట్టి వినాయకుని ప్రతిమలు

పలమనేరు: వినాయకచవితి సందర్భంగా ఏటా విగ్రహాల నిమజ్జనంతో పర్యావరణానికి ముప్పువాటిల్లుతూనే ఉంది. పీఓపీ అనర్థాలపై స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో చైతన్యం తెస్తున్నాయి. ఇటీవల ఓపీ విగ్రహాల నిమజ్జనంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో కొంత మార్పు వస్తోంది. వినాయకచవితి కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. భారీ సంఖ్యలో పీఓపీ విగ్రహాలను ఇప్పటికే తయారు చేసేశారు. అయితే ప్లాస్టర్‌ ఆఫ్‌ పారిస్‌తో ఏర్పడే పర్యావరణ సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ప్రజలపై ఉంది.

పీఓపీతో పొంచి ఉన్న ముప్పు

ఇవి భూమిలో త్వరగా కరగక నీటిలో జిప్సంగా మారి కాలుష్యానికి కారణమై నీటిలో ప్రాణ వాయువు స్థాయి తగ్గి జలచరాలకు ఇబ్బందిని కలిగిస్తాయి. భూమిలోకి నీటిని ఇంకనీయకుండా అడ్డుకుంటాయి. దీంతో నీరు ఆవిరై వృథా అవుతుంది. దీనికితోడు ఇవి త్వరగా కరగవు. నీటి కాఠిన్యాన్ని పెంచి నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది నీటిలో చేరి నీటి ఆమ్లత్వాన్ని, టీడీఎస్‌(టోటల్‌ డిస్సాయిల్స్‌ సాలిడ్స్‌)శాతాన్ని పెంచుతుంది. పీఓపీతోబాటు ఉపయోగించే రంగులతో హానికరమైన పాదరసం, కాడ్మియం, సీసం చేరిన నీటిని తాగడంతో కిడ్నీలు, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. నీటిలో కలిసే థర్మోకోల్‌, ప్లాస్టిక్‌ పువ్వులు, వస్త్రాలతో నీటి కాలుష్యం ఎక్కువై అలాంటి అపరిశుభ్రమైన నీటిని తాగడం వల్ల పశువులకు రోగాలతోబాటు చర్మవ్యాధులు సోకే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం

ప్లాస్టర్‌ ఆఫ్‌ పారిస్‌(పీఓపీ) వలన జరిగే అనర్థాలపై పలు స్వచ్ఛంద సంస్థలైన పలమనేరు పరిరక్షణ సమితి, రసజ్ఞుల సమాఖ్య, జనవిజ్ఞానవేదిక లాంటి సంస్థలు ఇప్పటికే అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాయి. దీనికి తోడు పాఠశాలలో మట్టి వినాయకులు ఆవశ్యతను ఉపాధ్యాయులు పిల్లలకు వివరించాలి. సోషల్‌ మీడియాలోనూ పలువురు వీఐపీలు మట్టి ప్రతిమలనే వాడుదామంటూ తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు. దీనికి తోడు సంబంధిత కుమ్మర, శాలివాహన సంఘాలు మట్టి బొమ్మల ఆవస్యతను తెలియజేస్తున్నాయి. దీంతో ప్రజలు మట్టి వినాయకులు కొనుగోల్లకు ఆసక్తిని చూపుతారని ఆశిద్దాం.

మట్టి విగ్రహాలకు పెరుగుతున్న ఆదరణ

జరుగుతున్న అనర్థాలపై ప్రజలు ఆలోచించి, ఆచరించి, అందరం కలసి రాబోవు తరాలకు సుందరమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని ఇవ్వాల్సి ఉంది. పీఓపీ అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ఇదో సామాజిక బాధ్యతగా మట్టి వినాయకుని విగ్రహాలను చవితి సంబరాలను జరుపుకొనేందుకు ప్రజలు ఆసక్తిని చూపుతున్నారు. జిల్లాలో వినాయక చవితిని విశిష్టమైన మట్టి ప్రతిమలతో ఊరూ, వాడా, ఇల్లలో ఉంచి పూజలు చేయాలని కోరుకుందాం.

పీఓపీ అంటే..



ప్రమాదకర పీవోపీ విగ్రహాలు

జిప్సంను 120 నుంచి 180 డిగ్రీల వరకు వేడిచేస్తే పీఓపీ తయారవుతుంది. దీని రసాయన నామం కాల్షియం సల్ఫేట్‌ హెమీహైడ్రేట్‌. ఇది ఓ తెల్లటి నిర్మాణపదార్థం. ఇది 25 సెంటీగ్రేడ్‌ వద్ద నీటిలో ద్రావణీయత 0.3గ్రాములుగా ఉండి నీటిలో ముంచగానే వెంటనే ఓ గట్టి పదార్థంగా మారుతుంది. 18వ శతాబ్దంలో ప్యారిస్‌ చుట్టూ లభ్యమయ్యే జిప్సంను భారీ స్థాయిలో మైనింగ్‌ చేసి దీన్ని తయారుచేయడంతో అప్పటి నుంచి దీనికి ప్లాస్టర్‌ ఆఫ్‌ పారిస్‌ అనే పేరొచ్చింది. వాస్తవంగా దీన్ని విరిగిన ఎముకలు, కీళ్ల అచ్చులకు ఉపయోగిస్తారు. దీంతోపాటు ఇళ్ల పైకప్పులు, అలంకరణలు, నల్లబల్ల తయారు చేస్తారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడుకుందాం



వీటి ధర చాలా తక్కువగా ఉంటుంది. ఇవి నీటిలో సులభంగా కరిగి కాలుష్యాన్ని కలిగించవు. చెరువులోని బంకమట్టిని తీయడం వలన నీటి నిల్వ శాతం పెరిగి భూగర్భజలాలు పెరుగుతాయి. వీటిని తయారు చేసే పని వాళ్లకు ఆర్థిక భరోసాతో పాటు వారిని ప్రోత్సహించినట్టే. కాబట్టి మట్టి వినాయకులను పెట్టి పర్యావరణాన్ని కాపాడుకుందాం. ఇది మనందరి బాధ్యతగా భావిద్దాం.
–రమణ, జిల్లా సైన్స్‌ అధికారి

పీవోపీకి వ్యతిరేకంగా పోరాటం



పర్యావరణంతో బాటు ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నాం. ఇప్పటికే మట్టి విగ్రహాల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పీవోపీ విగ్రహాలు చూసేందుకు భారీగా కలర్స్‌తో ఉంటాయి. దీంతో పీవీపీ విగ్రహాలపై జనం మోజుపడుతున్నారు. అందుకే ప్రజల్లో అవగాహన నింపేందుకు పీపీఎస్‌, రసజ్ఞుల సమాఖ్య, కుమ్మర సంఘం, పలమనేరు హెల్పింగ్‌ హ్యాండ్స్‌ తదితర సంఘాలు జతకట్టి మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం.
–మిలటరీ సిద్ధయ్య, పలమనేరు